ఆదివారం 29-09-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 470 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

## మహిళల విషయంలో సమాజ ఆలోచనా మారాలి

- వేధింపుల కేసులపై సత్వర పరిష్కారం కావాలి
- మహిళా లాయర్లతో బలమైన నెట్‌వర్క్ రావాలి
- నల్సార్ యూనివర్శిటీలో రాష్ట్రపతి ముర్ము




ముందడుగు హైదరాబాద్:

సమాజంలో మహిళల విషయంలో ఆలోచన ధోరణి మారాలని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు చెక్ పెట్టేందుకు సత్వర పరిష్కారం కావాలని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. దేశంలో మహిళా లాయర్లతో జాతీయ స్థాయిలో ఒక బలమైన నెట్‌వర్క్ ఏర్పాటు చేయాల్సి ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్ శివారులోని నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వర్సిటీలోని వివిధ విభాగాలలో మిగతా 2లో



## జవాన్లను కాంగ్రెస్ ఎన్నడూ గౌరవించలేదు

**మూడు కుటుంబ పార్టీలతో ప్రజలు విసిగిపోయారు**
**ఈ ప్రాంత ప్రజలు వివక్షను కోరుకోవడం లేదు**
**జమ్మూకశ్మీర్ ప్రచారంలో ప్రధాని మోడీ**


ముందడుగు జమ్మూకశ్మీర్:

కాంగ్రెస్, ఎన్సీపీ, పీడీపీ ఈ మూడు కుటుంబ పార్టీలతో జమ్మూకశ్మీర్ ప్రజలు విసిగిపోయారని, అవినీతి, ఉద్యోగాల్లో వివక్షను ఈ ప్రాంత ప్రజలు కోరుకోవడం లేదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జమ్మూలో బిజెపి ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, రక్తపాతానికి దూరంగా ఉండాలని వారు ఆకాంక్షిస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మిగతా 2లో




నేపాల్‌లో బీభత్సం సృష్టిస్తున్న వరదలు

మిగతా 2లో



యాదగిరిగుట్ట ఆలయ గోపురానికి బంగారు తాపడం

మిగతా 3లో



మనదేశంలో డబ్బున్న వాళ్లంటే ద్వేషమెందుకు..

మిగతా 4లో




అత్యధిక ఆదాయాన్ని తెచ్చే రైలు ఇదే..

మిగతా 5లో

### హెజ్‌బొల్లా అధిపతి

## హసన్ నస్రల్లా మృతి

### ధృవీకరించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్

ముందడుగు జాతీయం:




ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా లక్ష్యంగా భీకర స్థాయిలో విరుచుకుపడింది. బీరుట్‌లోని హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై విధ్వంసకర బాంబులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హెజ్‌బొల్లా అధిపతి హసన్ నస్రల్లా మరణించినట్లు తాజాగా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ధ్రువీకరించింది. ఈ మేరకు తమ 'ఎక్స్' మిగతా 2లో

## మూసీ నిర్వాసితుల్ని ఆదుకుంటాం

- వరదలు వస్తే ఇబ్బంది పడేది ప్రజలే
- ఎమ్మెల్యేలతో క్షేత్ర పర్యటనకు వెళ్తాం
- మీడియాతో దానకిషోర్, రంగనాథ్

ముందడుగు హైదరాబాద్:



హైడ్రా వల్ల ఎవరిని ఇబ్బందులు పెట్టమని, మూసీ నిర్వాసితుల్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్ తెలిపారు. మిగతా 2లో

ముందడుగు
ఆదివారం, 29-09-2024, హైదరాబాద్

# మహిళల విషయంలో సమాజ ఆలోచనా మారాలి

(మొదటిపేజీ తరువాయి)

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు గవర్నర్ అలోక్ అరాధే, తదితరులు హాజరయ్యారు.

అనేక రంగాల్లో ముందడుగు వేసిన మన సమాజం.. మహిళాభ్యుదయం విషయంలో మాత్రం వెనకబడే ఉందని రాష్ట్రపతి ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఏదోమూల నేటికీ వారిపై జరుగుతున్న అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని, వాటిని అరికట్టాలంటే నల్సార్ వంటి లా వర్సిటీలన్నీ కలిసి, మహిళా వకీళ్లుగా ఉన్న తమ పూర్వ విద్యార్థులతో ఓ జాతీయ నెట్‌వర్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. మనదేశంలో నేటికీ సంపన్నులకు అందినంత వేగంగా పేదలకు న్యాయం అందటం లేదని, కనుక న్యాయవాదులు, అట్టడుగు వర్గాల బాధితుల పక్షాన నిలబడి వారికి న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. దక్షిణాఫ్రికా నుంచి మహాత్మా గాంధీ బీహార్‌లోని చంపారన్ పేద రైతుల పక్షాన నిలిచి విజయం సాధించారని గుర్తుచేశారు. ప్రతి 10 గ్రామాలకు ముగ్గురు న్యాయాధికారులు ఉండాలని, వివాదం పరిష్కారం అయ్యే వరకు జడ్జీలు, పిటిషనర్ల మధ్య ఎలాంటి ప్రైవేట్ సంభాషణలు ఉండకూడదని చాణిక్యుడు తన అర్థశాస్త్రంలో చెప్పిన విషయాన్ని ముర్ము ప్రస్తావించారు.

# జవాన్లను కాంగ్రెస్ ఎన్నడూ గౌరవించలేదు

(మొదటిపేజీ తరువాయి)

జవాన్ల విలువ కాంగ్రెస్‌కు తెలియదంటూ ఆ పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "కాంగ్రెస్ హయాంలో సరిహద్దుల్లో కాల్పులు జరిగినప్పుడల్లా ఆ పార్టీ తెల్ల జెండాలను ఎగురవేసింది. కానీ, భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. భారత్ ఉగ్రవాదులపై ఎదురుకాల్పులకు దిగింది. 2016 సెప్టెంబరు 28 రాత్రి సర్జికల్ స్ట్రైక్ జరిగింది. శత్రువుల భూభాగంలోకి వెళ్లి దాడి చేయగలిగిన నవ భారత్‌ను నాడు ప్రపంచమంతా చూసింది. దేశ రక్షణ కోసం జవాన్లు చేసిన త్యాగం విలువ ఆ పార్టీకి తెలియదు. వారిని ఎన్నడూ గౌరవించ లేదు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ సైనికులకు మాయమాటలు చెప్పింది. 'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' ఇస్తామంటూ వారిని ఎదురుచూసేలా చేసింది" అని తీవ్ర ఆరోపణలు చేశారు.

## హెజ్‌బొల్లా అధిపతి

# హసన్ నస్రల్లా మృతి

## ధృవీకరించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాలో పోస్ట్ చేసింది. "నస్రల్లా ఇక ఈ ప్రపంచాన్ని ఉగ్రవాదంతో భయభ్రాంతులకు గురిచేయలేడు" అని రాసుకొచ్చింది. అటు ఇజ్రాయెల్ వార్ రూమ్ దీనిపై స్పందించింది. 'ఆపరేషన్ న్యూ ఆర్డర్' మిషన్ విజయవంతమైనట్లు వెల్లడించింది. శుక్రవారం రాత్రి దక్షిణ లెబనాన్‌లోని దాహియాలోని నివాసగృహాల కింద భూగర్భంలో ఉన్న హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై ఐడీఎఫ్ వైమానిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నస్రల్లా ఇదే కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తమకు పక్కా సమాచారం వచ్చిందని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ దాడుల్లో భవనం పూర్తిగా ధ్వంసమైందని, ఇందులో నస్రల్లా సహా ఎవరూ బతికే అవకాశాలు లేవని ఆ తర్వాత ఐడీఎఫ్ అభిప్రాయం వ్యక్తం చేసింది. తాజాగా అతడు మృతిచెందినట్లు ధ్రువీకరించింది.

# మూసీ నిర్వాసితుల్ని ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు, నిర్వాసితుల తరలింపు, బాధితుల ఆందోళన తదితర అంశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. "గతంలో మూసీకి వరదలు భారీగా వచ్చేవి, అప్పట్లోనూ నిర్వాసితులను తరలించారు. గతంలో మూసీ సుందరీకరణకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య పలు సూచనలు చేశారు. ఇటీవల ఖైరతాబాద్‌లో 20 నిమిషాల్లో 9 సె.మీ కుపైగా వర్షపాతం నమోదైంది. చిన్న వర్షాలకే హైదరాబాద్ ముంపునకు గురవుతోంది. నగరంలో ప్రస్తుతం కోటి జనాభా ఉంది. మూసీ పరివాహక ప్రాంతం మురికికూపంలా మారింది.. దాన్ని మార్చాలి. మూసీకి వరదలు వస్తే ఇబ్బందులు పడేది ప్రజలే. కుచించుకుపోయిన మూసీని విస్తరించడమే మా లక్ష్యం. మూసీ సుందరీకరణ ద్వారా ఉద్యోగ అవకాశాలు వస్తాయి. మూసీ పరిధిలోని ఎమ్మెల్యేలను తీసుకొని క్షేత్ర పర్యటనకు వెళ్తామని తెలిపారు.




# బీభత్సం సృష్టిస్తున్న వరదలు

## ఎనిమిది జిల్లాలో 39మంది మంది

### ఆకస్మిక వరదలకు అనేక గ్రామాలు ముంపులోనే

### బీహార్‌పై ప్రభావం పడే అవకాశం

ముందడుగు నేపాల్:

గతకొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు వల్ల నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వర్షాల వల్ల ఎనిమిది జిల్లాల్లో దాదాపు 39మంది మరణించారు. సుమారు 11మంది గల్లంతైనట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. ఆకస్మిక వరదలు పోటెత్తడంతో దేశంలోని అనేక ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. జనజీవనం స్తంభించింది. ఈ వరదలు మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని విపత్తు ప్రతిస్పందన అధికారులు హెచ్చరిస్తున్నారు.

వరదలు పోటెత్తుతుండటంతో ఖార్‌మాండూలో 9మంది, లలిత్‌పూర్‌లో 16 మంది, భక్తపూర్‌లో ఐదుగురు, కవ్రేపాలన్‌చౌక్‌లో ముగ్గురు, పంచతార్, ధన్‌కూటాలో ఇద్దరు, ఝూపా, ధాడింగ్‌లో ఒక్కొక్కరు చొప్పున మరణించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. 226 ఇళ్లు పూర్తిగా నీటమునిగిపోయాయని, బాధిత ప్రాంతాల్లో దాదాపు 3,000 మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని అధికారులు వెల్లడించారు. నేపాల్ సాయుధ పోలీసు దళానికి చెందిన 1,947 మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావ ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి 23 రాఫ్టింగ్ బోట్లను సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 760 మందిని రక్షించినట్లుగా వెల్లడించారు.

ముందడుగు
ఆదివారం, 29-09-2024, హైదరాబాద్

# యాదగిరిగుట్ట ఆలయ గోపురానికి బంగారు తాపడం

## పనులు ప్రారంభించేందుకు సీఎం అనుమతి



**ముందడుగు యాదగిరిగుట్ట:**

తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సారథ్యంలో జరిగిన సమావేశాల్లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి చొరవతో దేవాలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అనుమతి ఇచ్చారు. వెంటనే ఆ పనులను ప్రారంభించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బంగారు తాపడం పనుల బాధ్యతలను స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ పనులు స్వామి బ్రహ్మోత్సవాల నాటికి ముందే 2025 మార్చిలోగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఛైర్‌పర్సన్‌గా, దేవాదాయ శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా ప్రభుత్వ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సలహాదారు, వైటీడీఏ ఉపాధ్యక్షుడు జి.కిషన్‌రావు, యాదగిరిగుట్ట దేవస్థాన కార్యనిర్వహణాధికారి, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బంగారు తాపడం పనులను పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలివ్వనున్నారు. ఈ మేరకు బంగారు తాపడం పనులు, ఈ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సంబంధించి రెండు వేర్వేరు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ అభివృద్ధి, విస్తరణ పనుల నిమిత్తం భూసేకరణకు అనుమతులను మంజూరు చేస్తూ మరో జీవో జారీ చేసింది.

# సునీతా విలియమ్స్ కోసం రెస్క్యూ మిషన్

## సెప్టెంబర్ 28 నుంచి మిషన్ ప్రారంభం

**ముందడుగు జాతీయం:**



అంతరిక్షం నుంచి సునీతా విలియమ్స్, బారీ విల్మోర్‌ని భూమి మీదకు తీసుకువచ్చేందుకు నాసా శాస్త్రవేత్తలు రెస్క్యూ మిషన్‌ను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 28 నుంచే ఈ మిషన్ ప్రారంభమైంది. జూన్ నెలలో బోయింగ్ స్టార్ లైనర్ స్పేస్ క్యాప్సూల్‌లో వీరిద్దరు అంతరిక్షంలోని "అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)" వద్దకు వెళ్లారు. అయితే, స్టార్ లైనర్‌లో హీలియం లీకేజీలు, థ్రస్టర్లలో వైఫల్యం వంటి కారణాలతో దాంట్లో తిరిగి భూమి పైకి రావడం ప్రమాదమని భావించిన శాస్త్రవేత్తలు, వారు లేకుండానే స్టార్ లైనర్ భూమి మీదకు తీసుకువచ్చారు.

వీరిని స్పేస్ ఎక్స్‌కి చెందిన వ్యోమనౌక క్రూ9 ద్వారా భూమి మీదకు తీసుకురాబోతున్నారు. క్రూ9 మిషన్ కోసం ఫ్లోరిడాలోని కేప్ కెనావెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి వ్యోమనౌక వెళ్లేందుకు సిద్ధమైంది. అన్ని ప్రణాళిక ప్రకారం జరిగితే, సిబ్బంది సెప్టెంబర్ 29 సాయంత్రం 5.30 గంటలకు అంతరిక్షంలోకి వెళ్లబోతోంది. ఈ క్రూ9లో నాసా కమాండర్ నిక్ హేగ్, రష్యా రోస్కోస్మోస్ నుంచి అలెగ్జాండర్ గుర్బునోవ్ ఉన్నారు. స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ క్యాప్సూల్ ద్వారా నలుగురు వ్యోమగాములు ప్రయాణించేందుకు వీలుగా ఉంటుంది. జూన్ 6 నుంచి ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయిన బారీ విల్మోర్, సునీతా విలియమ్స్ ఇందులో తిరిగి రావడానికి రెండు సీట్లు ఖాళీగా ఉంటాయి. ప్రస్తుతం వీరిద్దరు ఐఎస్ఎస్‌లో పార్క్ చేయబడిన క్రూ 8లో ఉన్నారు. క్రూ9 వచ్చిన తర్వాత వీరిద్దరు ఇందులోకి వెళ్తారు.





# 200 గ్రాముల బంగారంతో నేసిన చీర

## సిరిసిల్ల చేనేత కళాకారుడి అద్భుతం

**ముందడుగు సిరిసిల్ల:**

200 గ్రాముల పసిడితో బంగారు చీర తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ మరో అరుదైన రికార్డు సృష్టించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త 200 గ్రాముల బంగారంతో చీర తయారు చేయాలని కోరారు. ఈ చీరను తయారు చేయడానికి ఆరు నెలల క్రితమే ఆర్డర్ తీసుకున్నట్లు విజయ్ తెలిపారు. బంగారాన్ని జరి తీయడానికి కొత్త డిజైన్ తయారు చేయడానికి 10 నుంచి 12 రోజులు పట్టింది.

ఈ చీర 49 ఇంచుల వెడల్పు, ఐదున్నర మీటర్ల పొడవు, బరువు 800 నుంచి 900 గ్రాములు ఉంటుందన్నారు. ఆ వ్యాపారవేత్త వచ్చే నెల 17న జరిగే తన కుమార్తె వివాహానికి ఈ చీరను తయారు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ చీరను రూ.18 లక్షల వ్యయంతో తయారు చేసినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. బంగారంతో చీర తయారు చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

ముందడుగు
ఆదివారం, 29-09-2024, హైదరాబాద్



# ఉత్తర, దక్షిణ సంస్కృతుల కలయికలో నవరాత్రి నైట్స్

## దాండియాతో పాటు బతుకమ్మ వేడుకలు

**ముందడుగు హైదరాబాద్:**

ప్రముఖ మోడల్స్‌తో దాండియా డ్యాన్స్‌ల ఆకర్షణీయమైన ప్రదర్శన, ఉత్సాహభరితమైన వేడుకలతో ఏజీ స్పోర్ట్స్ క్లబ్ నవరాత్రి నైట్స్ నిర్వహిస్తోంది. కర్టెన్ రైజర్ కార్యక్రమంలో భాగంగా ఏజీ స్పోర్ట్స్ క్లబ్ నవరాత్రి నైట్స్ ఈవెంట్ నిర్వాహకులు, మోడల్స్ నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏజీ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు క్రాంతి మాట్లాడుతూ ఈ ఈవెంట్ స్పెషాలిటీ ఏంటి అంటే మన సిటీలో ఎక్కడ చూసుకున్నా నవరాత్రి సెలబ్రేషన్స్ అంటే ఓన్లీ దాండియా మాత్రమే ఉంది. కాని ఇక్కడ మన ఏజీ స్పోర్ట్స్ క్లబ్ లో 9 రోజుల బతుకమ్మ వేడుకలతో పాటు దాండియా సెలబ్రేషన్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వంశీ పల్లె, డీజే ఫ్లోజా చౌదరి తదితరులు పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు లేదా దాండియా నృత్య పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ల కోసం నిర్వాహకులను **9105691076** నంబర్‌లో సంప్రదించవచ్చు. ఏజీ స్పోర్ట్స్ క్లబ్ నవరాత్రి నైట్స్ ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక అనుభూతిని కలిగిస్తుందని నిర్వాహకులు తెలిపారు.



# మహిళలను చైతన్యపరిచే షార్ట్‌ఫిల్మ్‌లు రావాలి

## దిక్చూచి ప్రివ్యూలో చంచల్‌గూడ జైలు ఎస్పీ శివకుమార్

**హైదరాబాద్:**

సమాజానికి మంచి సందేశం ఇస్తూ, ఆలోచింపజేసే షార్ట్ ఫిల్మ్‌లు నిరంతరం వస్తూ ఉండాలని చంచల్‌గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ గౌడ్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో దిక్చూచి అనే షార్ట్‌ఫిల్మ్ ప్రివ్యూ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర పల్నాటి, డా. స్రవంతి, డా. ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్ కోల్‌కతాలో జరిగిన జూనియర్ వైద్యురాలి అత్యాచారం, హత్యను ఇతివృత్తంగా తీసుకొని చిన్న చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ప్రివ్యూలో చంచల్ గూడ జైలు ఎస్పీ శివకుమార్ మాట్లాడుతూ తప్పు చేసిన వారికి సత్వర శిక్షలు అమలు కావాలని, బాలికలు, మహిళలపై జరిగే వేధింపులు, అఘాయిత్యాలపై చేసే వారికి భయం ఉంటుందన్నారు. ప్రతి మనిషిలో ఒక మార్పు కోసం ఈ చిత్రం దోహదపడుతుందన్నారు. ఈ చిత్రాన్ని రమేశ్ బాబు కొమటి నిర్వహించగా, శివనాగరాజు దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర పల్నాటి, డాక్టర్ స్రవంతి, డా. ఇందిరా ప్రియదర్శిని, సినిమా డైరెక్టర్ శివనాగరాజు, నిర్మాత రమేష్‌బాబు కొమటి, నటి హేమ, యాక్ సభ్యులు కొన్నె దేవేందర్, గంగాధర్, సినిమా బృందం ఆర్యన్ వర్మ, దినేష్619, క్రేజీ బాయ్స్ సాయి కిరణ్, డా. స్నిగ్ధ, ఎడిటర్ కేతన్ కుమార్ గౌడ్, కెమరామెన్ నవీన్ కుమార్ పొన్నాల, కలరిస్ట్ రామోజు మణికంఠ చారీ, మ్యూజిక్ హర్ష భరద్వాజ్, అసిస్టెంట్స్ గా జాఫరీ వలి, కృష్ణవంశీ సాంకేతికంగా పని చేసారు.



# మనదేశంలో డబ్బున్న వాళ్లంటే ద్వేషమెందుకు..

## జెరోధా సీఈఓ నితిన్ కామత్‌కు ఎదురైన ప్రశ్న

**ముందడుగు జాతీయం:**



బెంగళూరులో జరిగిన ఓ ఈవెంట్‌లో జెరోధా సీఈఓ నితిన్ కామత్‌కు ఓ ప్రశ్న ఎదురైంది. సంపన్నుల విషయంలో అమెరికా, భారతపౌరులు వ్యవహరించే తీరుపై యువర్ స్టోరీ వ్యవస్థాపకురాలు శ్రద్ధాశర్మ ఈ ప్రశ్న అడిగారు. "అమెరికాలో ఎవరైనా బాగా సంపాదిస్తే.. వారి ఫొటోలు అక్కడి కవర్ పేజీల్లో వస్తాయి. వారు కార్లు కొనుక్కుంటారు. ఇదంతా అక్కడ సర్వసాధారణంగా జరిగిపోతుంది. మన దేశంలో మాత్రం అలా ఎవరైనా ఎదిగితే.. వారేదో తప్పు చేసి సంపాదించారన్న భావన నెలకొంటుంది. వారిపై చాలామందిలో ద్వేషం ఉంటుంది. ఈ పరిస్థితికి కారణం ఏంటి?" అని నితిన్ కామత్‌ను ప్రశ్నించారు. బిలీయనీర్లలో ఒకరైన నితిన్ కామత్ కూడా ఆమె అభిప్రాయంతో ఏకీభవించారు. దేశంలో ఉన్న సంపదలో అసమానతలే దీనికి కారణమని పేర్కొన్నారు. మన సమాజంలో ఉన్న సోషలిస్టు ఆలోచనా దృక్పథమే కారణమని చెప్పారు. "అమెరికా పూర్తి పెట్టుబడిదారీ సమాజం. మనం పెట్టుబడిదారుల సమాజంగా నటిస్తున్న సోషలిస్టులం. మన గుండెల నిండా సోషలిజం నిండి ఉంటుంది. అందుకే ఈ పరిస్థితి" అని సమాధానం ఇచ్చారు. మరి ఈ పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉందా? అని ప్రశ్నించగా.. సంపద విషయంలో అసమానతలు కొనసాగేంతవరకు పరిస్థితులు మారుతాయని తాను అనుకోవడం లేదని నితిన్ కామత్ బదులిచ్చారు.

ముందడుగు
ఆదివారం, 29-09-2024, హైదరాబాద్




# అత్యధిక ఆదాయాన్ని తెచ్చే రైలు ఇదే..

## సంవత్సరానికి 5,09,510 మంది ప్రయాణికులు.. ఈ రైలు ఏడాది ఆదాయం రూ. 176 కోట్లు

4ముందడుగు ప్రత్యేకం:

భారతీయ రైల్వే సేవలు **1853**లో ప్రారంభమయ్యాయి. మొదటగా ముంబయి, థానే మధ్య రైలు నడిచింది. నేడు భారతదేశం అంతటా ప్రజలను కనెక్ట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం **67,000** కిలోమీటర్ల ట్రాక్‌లతో నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌లలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకుంది. భారత రైల్వే నెట్‌వర్క్‌ను **18** జోన్లుగా విభజించారు. ప్యాసింజర్, ఫ్రైట్, లగ్జరీ రైళ్లు వివిధ రూట్లలో నడుస్తున్నాయి. వీటి ద్వారా రైల్వేస్ ఆదాయం కూడా భారీగా పెరిగింది. ముఖ్యంగా ఒక ట్రైన్ ద్వారా సంవత్సరానికి ఏకంగా రూ.**176**కోట్ల ఆదాయం వస్తోంది. ఇది దేశంలోనే ఎక్కువ రెవిన్యూ అందించే ట్రైన్ సర్వీస్‌గా నిలుస్తోంది.

### వివిధ రకాల రైళ్లు

భారత రైల్వే నెట్‌వర్క్‌లో చాలా రకాల రైళ్లు సేవలు అందిస్తున్నాయి. రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్ వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లను అలాగే లోకల్, మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కలిగి ఉంది. కొత్తగా ప్రారంభం అయిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణ సమయాన్ని చాలా వరకు తగ్గించాయి. ఈ రైళ్లను మరిన్ని మార్గాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే ప్రయాణిస్తుంది. సరకుల రవాణాకు ఉపయోగించే గూడ్స్ రైళ్లు కూడా రైల్వేకి ప్రధాన ఆదాయం అందిస్తున్నాయి. ఈ రైళ్లు భారతదేశ రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయి.

### రెండో స్థానంలో కోల్‌కతా- న్యూఢిల్లీ

దీనికి దగ్గరల్లో కోల్‌కతా నుంచి న్యూఢిల్లీకి నడిచే సీల్దా రాజధాని ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం.**12314**) ఉంది. ఇది **5,09,164** మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. ఏకంగా రూ.**1,28,81,69,274** సంపాదించింది.




### అత్యంత లాభదాయకమైన రైలు

వందే భారత్, శతాబ్ది ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు పాపులర్ అయినప్పటికీ అవి ఎక్కువ లాభదాయకం కాదు. హజ్రత్ నిజాముద్దీన్, KSR బెంగళూరు మధ్య నడిచే బెంగుళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం.22692) అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే రైళ్లలో టాప్ ప్లేస్‌లో ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ రైలు 5,09,510 మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. తద్వారా ఏకంగా రూ.1,76,06,66,339 ఆదాయాన్ని ఆర్జించింది.

### ప్రపంచంలోనే బెస్ట్

భారతీయ రైల్వే దాదాపు 10 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. ప్రపంచంలోనే అత్యధిక ఉద్యోగులను కలిగి ఉన్న సంస్థగా రికార్డు అందుకుంది. ప్రజలకు తక్కువ ధరలకు మెరుగైన, సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తూ, భారత ఆర్థిక వస్యవస్థకు తోడ్పడుతోంది. టికెట్ సేల్స్ ద్వారా భారీగా ఆదాయం అందుకుంటోంది.

### మూడో స్థానంలో న్యూఢిల్లీ- దిబ్రూఘర

మూడో స్థానంలో న్యూ ఢిల్లీ, దిబ్రూఘర్ మధ్య నడుస్తున్న దిబ్రూగర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ ఉంది. ఈ ట్రైన్‌లో అతే సమయంలో 4,74,605 మంది ప్రజలు ప్రయాణించారు. రూ.1,26,29,09,697 సంపాదించి మూడో స్థానం దక్కించుకుంది.